క్లుప్తంగా

బాధిత కుటుంబాలకు చేయూత



ఆర్థిక సాయం చేస్తున్న దశరథ్‌నాయక్

కడ్తాల్: మండలంలోని అన్మాస్‌పల్లి గ్రామంలో ఇటీవల మృతి చెందిన రామకృష్ణ, లక్ష్మయ్య కుటుంబ సభ్యులను రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, జెడ్పీటీసీ దశరథ్‌నాయక్ ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబాలకు, ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ.5 వేల చొప్పున ఇరు కుటుంబాలకు రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. పరామర్శించిన వారిలో సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్‌గుప్తా, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పరమేశ్, రైతుబంధు జిల్లా సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, నాయకులు శ్రీను, దేవులా, రాజు, విష్ణు, శేఖర్ ఉన్నారు.

ఆర్థిక సహాయం

తలకొండపల్లి: మండలంలోని రాంపూర్‌కు చెందిన యాదమ్మ (47) ఆదివారం మృతి చెందింది. సర్పంచ్ శ్యాంసుందర్‌రెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థి కసిరెడ్డి నారాయణరెడ్డి, మిషన్ భగీరథ వైస్ చైర్మన్‌లు బాధిత కుటుంబాన్ని పరామర్శించి సానుభూతి తెలిపారు. అనంతరం వ్యక్తిగతంగా సర్పంచ్ రూ. 3000, నారాయణరెడ్డి రూ. 5000, మిషన్ భగీరథ వైస్ చైర్మన్ రూ.3000లు ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ మోహన్‌రెడ్డి, మహేష్, శ్రీశైలంయాదవ్, యాదయ్య, జానయ్య పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక



కాంగ్రెస్‌లో చేరుతున్న వడ్డెర సంఘం నేతలు

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణానికి చెందిన పలువురు వడ్డెరసంఘం నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. పట్టణంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వస్పుల జంగయ్య, గుర్రం కేశవులు, మానయ్యల ఆధ్వర్యంలో స్థానిక వడ్డెరసంఘం నాయకులు, మహిళలు పెద్ద ఎత్తున చేరారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ నాయకులు శివలింగం, ఖాదర్‌ఖాద్రి, సంజీవ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఫ్రెషర్స్ డే



వేడుకలను ప్రారంభిస్తున్న అరుణకుమారి

అబ్దుల్లాపూర్‌మెట్ : మండలం పరిధిలోని గుంతపల్లి గ్రామంలో గల అవంతి ఫార్మసీ కళాశాలలో 'ఆరంభ్ 2023–24' పేరుతో నిర్వహించిన ఫార్మసీ మొదటి సంవత్సరం విద్యార్థుల ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు ముఖ్యఅతిథులుగా జేఎన్‌టీయూహెచ్ మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ అరుణకుమారి, క్యూసీ అండ్ క్యూఏ సొల్యూషన్స్ లిమిటెడ్ జీఎం. డాక్టర్ దీక్షిత్ అషుతోష్, సీసీఎంబీ సీనియర్ ప్రిన్సిపాల్ విజయలక్ష్మి హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఫార్మసీ రంగంలో ఉద్యోగ అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని, ఇండియన్ ఫార్మసీకి ప్రపంచ వ్యాప్తంగా మంచి గుర్తింపు ఉందన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ జయప్రద, ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తా

- ఎమ్మెల్యేగా అవకాశం ఇవ్వండి
- యువతకు ఉద్యోగ, ఉపాధి కల్పనకు కృషి చేస్తా
- కాంగ్రెస్ కల్వకుర్తి అభ్యర్థి కసిరెడ్డి నారాయణరెడ్డి



కడ్తాల్: ఇంటింటి ప్రచారంలో కసిరెడ్డి నారాయణరెడ్డి



కల్వకుర్తిలో ఎమ్మెల్సీ కసిరెడ్డికి మద్దతుగా ప్రచారం చేస్తున్న నాయకులు



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి

కడ్తాల్: ఎమ్మెల్యేగా ఒక్కసారి అవకాశం ఇవ్వండి.. అభివృద్ధి అంటే ఏంటో, తానేంటో చూపిస్తానని కాంగ్రెస్ కల్వకుర్తి అభ్యర్థి కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ఆదివారం ఆయన మండల పరిధిలోని సాలార్‌పూర్ గ్రామంతో పాటు పలు తండాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరు గ్యారంటీలతో పాటు ప్రజా సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

విస్తృతంగా ఇంటింటి ప్రచారం

ఆమనగల్లు: కల్వకుర్తి నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తానని కల్వకుర్తి కాంగ్రెస్ అభ్యర్థి కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ఆమనగల్లు మండలం మేడిగడ్డతండా, శంకరకొండ తండా, దయ్యాలబోడుతండా, కడ్తాల మండలం సాలార్‌పూర్, సాలార్‌పూర్‌తండాల్లో ఆదివారం కసిరెడ్డి విస్తృతంగా ప్రచారం చేశారు. ఇంటింటికి తిరుగుతూ హస్తం గుర్తుకు ఓటేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. ఆరు గ్యారంటీలు ప్రజల అభివృద్ధికి దోహదపడతాయని చెప్పారు. నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం శ్రమిస్తానని అన్నారు. ప్రస్తుతం జరగనున్న ఎన్నికల్లో తనను గెలిపిస్తే ప్రజలకు అందుబాటులో ఉండి అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ అనితవిజయ్, నాయకులు అర్జున్‌రెడ్డి, శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి, జగన్, గుర్రం కేశవులు, జంగయ్య, మానయ్య, మండ్లి రాములు, హరిలాల్, కిషన్, అలీం, నాజర్, ఫరీద్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే యువతకు ఉపాధి

కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే యువతకు ఉద్యోగ, ఉపాధి లభిస్తుందని జాతీయ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు పీ.వీ.శ్రీనివాస్ అన్నారు. బీఆర్‌ఎస్ సర్కార్‌ను గద్దె దింపేందుకు యువత నడుం బిగించాలని ఆయన పిలుపునిచ్చారు. ఆమనగల్లు మండలం రాంనుంతల గేటు సమీపంలోని డీఎంఆర్ ఫంక్షన్ హాలులో ఆదివారం కాంగ్రెస్ కల్వకుర్తి ఎమ్మెల్యే అభ్యర్థి కసిరెడ్డి నారాయణరెడ్డికి మద్దతుగా యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో యువ సమ్మేళనం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి జాతీయ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు పీ.వీ.శ్రీనివాస్, రాష్ట్ర యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శివసేనారెడ్డి, రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ఇంచార్జి ఖలీల్, కల్వకుర్తి అభ్యర్థి కసిరెడ్డి నారాయణరెడ్డి, నాగర్‌కర్నూల్ జెడ్పీ వైస్ చైర్మన్ బాలాజీసింగ్, పీసీసీ సభ్యులు అయిల శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ ఉపాధ్యక్షుడు సుంకిరెడ్డి వరప్రసాద్‌రెడ్డిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా పీ.వీ.శ్రీనివాస్ మాట్లాడుతూ.. రాష్ట్రంలోని కేసీఆర్ ప్రభుత్వం యువతకు ఉద్యో గాలు భర్తీ చేయడంలో విఫలమైందని ఆరోపించా రు. ఎన్నికల ముందు కేసీఆర్ నిరుద్యోగ భృతి ఇస్తానని చెప్పి మోసం చేశాడని మండిపడ్డారు. పరీక్షలను సరిగా నిర్వహించలేని అసమర్థ ప్రభుత్వ మని విమర్శించారు. సమావేశంలో వివిధ జి ల్లా ల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రవికాంత్‌గౌడ్, అనిల్ గౌడ్, వివిధ మండలాల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాజశేఖర్, దళపతి, హీరాసింగ్, నవీన్‌నాయక్ పాల్గొన్నారు. అంతకుముందు కడ్తాల నుంచి రాంనుంతల వరకు బైక్‌ర్యాలీ నిర్వహించారు.

కాంగ్రెస్‌దే గెలుపు

తలకొండపల్లి: రాష్ట్రంలో కాంగ్రెస్‌కు 82 సీట్లు వస్తాయని, కల్వకుర్తిలో కాంగ్రెస్ జెండా ఎగురవేసి ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణ్‌రెడ్డిని కచ్చితంగా గెలుపించుకుంటామని కాంగ్రెస్ కిసాన్‌సెల్ రాష్ట్ర కార్యదర్శి మోహన్‌రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. ఆదివారం ఆయన మండల కేంద్రంలో మాట్లాడారు. తెలంగాణ ప్రజలు మార్పును కోరుకుంటున్నారని అన్నారు. తెలంగాణ వస్తే తమకు కొలువులు వస్తాయని నిరుద్యోగ యువత ఆశించారని, పదేళ్లైనా ఉద్యోగాలు భర్తీ చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మిగులు బడ్జెట్‌తో ఉన్న తెలంగాణను కేసీఆర్ అప్పుల కుప్పగా మార్చారని ఆరోపించారు. రాష్ట్రంలో కేసీఆర్ రూ. 5.70 లక్షల కోట్ల అప్పు మిగిల్చారని, రాష్ట్రంలో ఒక్కొక్కరిపై రూ. 1.40 లక్షల అప్పు మోపారని దుయ్యబట్టారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని చెప్పారు. 30వ తేదీన కాంగ్రెస్‌కు ఓటు వేసి ఆశీర్వాదించాలని ప్రజలను ఆయన కోరారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించిందని విమర్శించారు. రాష్ట్రంలో దొరల పాలనను అంతం చేసి ప్రజల పాలన తెచ్చుకోవాలని మోహన్‌రెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు.

సైనికుడిలా పనిచేయాలి

కల్వకుర్తిరూరల్: కాంగ్రెస్ విజయం కోసం ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి కోరారు. ఆదివారం పట్టణంలో ఆయన ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా కల్వకుర్తిలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. పోలింగ్ వరకు నాయకులు, కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అహర్నిశలు కష్టపడితే కాంగ్రెస్సే విజయం సాధిస్తుందని పేర్కొన్నారు. అధికార పార్టీ నాయకులు మద్యం, డబ్బులతో ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే అవకాశం ఉందని తెలిపారు. రాష్ట్రంలో నిరంకుశ పాలనకు చరమగీతం పాడేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రతి నిమిషం అమూల్యమైందని నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో ముందు కు వెళ్లాలని దిశా, నిర్దేశం చేశారు. నియోజకవర్గ అ భి వృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమన్నారు. ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఆశీర్వదించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఏ గ్రామానికి వెళ్లినా ప్రజల నుంచి అనూ హ్య స్పందన లభిస్తుందని ఆయన సంతోషం వ్య క్తం చేశారు. పట్టణంలోని పలు వార్డులలో కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు కసిరెడ్డికి మద్దతుగా విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ గ్యారంటీ పథకాలపై జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి మిరియాల శ్రీనివాస్‌రెడ్డి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రాహుల్, ఖదీర్, పాండురంగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ రాజ్యంతోనే మేలు

- గ్యారంటీ పథకాలతో ఆర్థిక ప్రగతి
- కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి మల్‌రెడ్డి రంగారెడ్డి
- కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఈసీ శేఖర్‌గౌడ్

యాచారం: హస్తం గుర్తుకు ఓటేసి మీకు సేవ చేసే భాగ్యం కల్పించండని ఇబ్రహీంపట్నం కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి మల్‌రెడ్డి రంగారెడ్డి ప్రజలను కోరారు. ప్రచారంలో భాగంగా శనివారం రాత్రి మండల కేంద్రంలో రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే పేద ప్రజల్లో ఆర్థిక ప్రగతి సాధ్యమవుతుందన్నారు. ఆరు గ్యారంటీ పథకాలతో అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందని చెప్పారు. సీఎం కేసీఆర్ పదేళ్ల కాలంలో దోచుకున్న సొమ్ముతో ఓట్లను కొనుగోలు చేసి గెలవాలని చూస్తున్నారని మండిపడ్డారు. బీఆర్‌ఎస్ ఇచ్చిన డబ్బులు తీసుకొని, హస్తం గుర్తుకు ఓటు వేయాలని సూచించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే ఈ ప్రాంతంలో మైనింగ్ జోన్, ఫార్మాసిటీ రద్దు చేస్తామని భరోసా ఇచ్చారు. ఫార్మాసిటీ, మైనింగ్ జోన్ వల్ల ఈ ప్రాంతం సర్వనాశనం అవుతుందని ఆరోపించారు. ఈ సమావేశంలో యాచారం మండల పరిషత్ ఉపాధ్యక్షుడు కె. శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీపీ రమావత్ జ్యోతినాయక్, మాజీ పీఏసీఎస్ చైర్మన్ సుదర్శన్‌రెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి భాస్కర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సింహ, ఎండీ గౌస్ ఉన్నారు.

పట్నం గడ్డపై హస్తం గెలుపు ఖాయం

ఇబ్రహీంపట్నం రూరల్ : ఇబ్రహీంపట్నం గడ్డపై 35 సంవత్సరాల తర్వాత కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరబోతుందని ఆ పార్టీ సీనియర్ నాయకులు ఈసీ శేఖర్‌గౌడ్ పేర్కొన్నారు. ఆదిబట్ల మున్సిపాలిటీలో కాంగ్రెస్ అభ్యర్థి మల్‌రెడ్డి రంగారెడ్డిని గెలిపించాలని కోరుతూ ఆదివారం ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రాజు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

అత్యధిక మెజార్టీ ఇవ్వండి

అబ్దుల్లాపూర్‌మెట్: కాంగ్రెస్ పార్టీని ఆదరించి తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కాంగ్రెస్ ఇబ్రహీంపట్నం అభ్యర్థి మల్‌రెడ్డి రంగారెడ్డి కోరారు. ఆదివారం ఆయన మండల పరిధిలోని పెద్ద అంబర్‌పేట, మునగనూరు, తొర్రూర్, ఇంజాపూర్, కుంట్లూర్ గ్రామాల్లో ఎన్నికల ప్రచారాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా మల్‌రెడ్డి మాట్లాడుతూ... తాను ఎమ్మెల్యేగా గెలిస్తే ప్రతి ఇళ్ల సుఖ సంతోషాలతో ఉంటుందని.. ఏ ఒక్కరికీ కష్టం రాకుండా చూసుకుంటానని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో చైర్‌పర్సన్ చెవుల స్వప్న, వైస్‌చైర్‌పర్సన్ చామ సంపూర్ణ, కౌన్సిలర్లు చల్లారి మురళీధర్‌రెడ్డి, సిద్దంకి కృష్ణారెడ్డి, ఓరుగంటి సుజాత, జోర్కగీత, జయశ్రీరాజు, రాజేందర్ ముదిరాజ్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు కొత్తపల్లి జైపాల్‌రెడ్డి పాల్గొన్నారు.



రోడ్ షోలో మాట్లాడుతున్న కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి మల్‌రెడ్డి రంగారెడ్డి

మన రాజ్యాంగం ఇతర దేశాలకు దిక్సూచి

తుర్కయంజాల్: భారత రాజ్యాంగం ప్రపంచంలోని మిగతా దేశాలకు దిక్సూచి లాంటిదని బీజేపీ సీనియర్ నాయకులు కొంద్రు పురుషోత్తం, బీఆర్ఎస్ యువజన విభాగం నాయకులు మల్లెల ఉపేందర్‌లు అన్నారు. ఆదివారం రాజ్యాంగ దినోత్సవం పురస్కరించుకుని పురపాలక సంఘం పరిధి ఇంజాపూర్‌లో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ.. రాజ్యాంగం గొప్పతనాన్ని వివరించారు. కార్యక్రమంలో నరేష్ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ దినోత్సవ శుభాకాంక్షలు

తలకొండపల్లి: ప్రజలకు భారత రాజ్యాంగ దినోత్సవ శుభాకాంక్షలను టీఎస్ఎస్‌ఓ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనివాస్ తెలియజేశారు. ఆదివారం మండలంలోని లింగరావుపల్లిలో ఆయన మాట్లాడారు. అందరికీ సమాన హక్కులు, సమాన అవకాశాలు అనే సిద్ధాంతంతో మన దేశ రాజ్యాంగం రూపుదిద్దుకుందన్నారు. రాజ్యాంగం అమలు రాజకీయ పార్టీల ప్రథమ కర్తవ్యమని సూచించారు.



తలకొండపల్లి: కార్యక్రమంలో పాల్గొన్న సభ్యులు

పోలీసుల కవాతు

అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బాటసింగారం, కొత్తగూడెం, జాఫర్‌గూడ, బండరావిరాల, చిన్నరావిరాల, గువ్వలేటి గ్రామాల్లో స్థానిక సీ ఐ మన్మోహన్ ఆధ్వర్యంలో కేంద్ర బలగాలతో ఎస్ఐలు రమేష్‌నాయక్, వెంకట్రాంరెడ్డిలు ఆదివారం కవాతు నిర్వహించారు. – అబ్దుల్లాపూర్‌మెట్



అభివృద్ధికి ఓటెయ్యండి



కరపత్రాలు పంపిణీ చేస్తున్న సభ్యులు

ఆమనగల్లు: మండలం అభివృద్ధికి పాటుపడేవారికి ఓటు వేయాలని ఆమనగల్లు అభివృద్ధి సాధన సమితి సభ్యులు కోరారు. పట్టణంలో ఆదివారం అభివృద్ధి సాధన సమితీ ఆధ్వర్యంలో అభివృద్ధి పనులకు సంబంధించిన కరపత్రాలను ఓటర్లకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆమనగల్లు అభివృద్ధికి ఆమడదూరంలో ఉందన్నారు. హైదరాబాద్‌కు సమీపంలో ఉన్నా ఆమనగల్లులో సెజ్‌లు ఏర్పాటు చేయాలని, జాతీయ రహదారికి ఇరువైపులా షాపింగ్ కాంప్లెక్స్‌లు నిర్మించాలని, మెడికల్ కాలేజీ ఏర్పాటు చేయాలని, హైదరాబాద్ నుంచి శ్రీశైలం వరకు రైల్వేలైన్ ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే, ఆమనగల్లు వరకు మెట్రోరైల్ విస్తరించాలని, ఆర్టీసీ బస్ డిపోను నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. మండలంలోని రైతాంగానికి సాగునీరు అందించాలని, కేఎల్ఐ కాలువ నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం అందించాలని, అన్ని డివిజన్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని సభ్యులు డిమాండ్ చేశారు.

ప్రధాని మోదీని కలిసిన భాషయ్య

మంచాల: అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా హైదరాబాద్ వచ్చిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ఆదివారం రంగారెడ్డి జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడు భాషయ్య కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రపంచదేశాల్లో భారతదేశానికి సమున్నత గౌరవం తీసుకొచ్చిన గొప్ప నాయకుడు మోదీ అని కొనియాడారు. ఆయన నాయకత్వంలో ప్రజలందరూ పని చేయాలని కోరారు.




మోదీని కలిసిన భాషయ్య తదితరులు

342 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు పోల్

ఇబ్రహీంపట్నం: పోస్టల్ బ్యాలెట్ ఓట్లను ఆదివారం 342 మంది వేసినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి అనంతరెడ్డి తెలిపారు. శేరిగూడలోని శ్రీ ఇందు కళాశాలలో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్‌లో ఇతర పోలింగ్ సిబ్బంది 257 మంది, ఇబ్రహీంపట్నం ఎంపీడీఓ కార్యాలయంలో పోలీస్ శాఖకు చెందిన 85 మంది తమ ఓటు హక్కును పోస్టల్ బ్యాలెట్ పద్ధతిలో ఉపయోగించుకున్నట్లు చెప్పారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్లను వేసేందుకు సోమవారం కూడా అవకాశం ఉందని ఆర్వో తెలిపారు.

'పట్నం' రారాజు ఎవరో!

- బరిలో 28 మంది అభ్యర్థులు.. పోటీ ఆ ఇద్దరి మధ్యనే
- రాజకీయ అనుభవంలో తలపండిన నేతలు
- ఒకరు రెండుసార్లు, మరొకరు మూడు సార్లు ఎమ్మెల్యేగా పనిచేసిన అనుభవం
- ప్రజల తీర్పు ఈసారి ఎలా ఉండనుందో?





బీఆర్‌ఎస్ అభ్యర్థి మంచిరెడ్డి కిషన్‌రెడ్డి



కాంగ్రెస్ అభ్యర్థి మల్‌రెడ్డి రంగారెడ్డి



బీజేపీ అభ్యర్థి నోముల దయానంద్



సీపీఎం అభ్యర్థి పగడాల యాదయ్య

ఇబ్రహీంపట్నం: ఈ నెల 30న జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఇబ్రహీంపట్నం నుంచి ప్రజలు ఎవరికీ పట్టాభిషేకం చేస్తారోనని అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. దశాబ్దాల రాజకీయాల అనుభవం గల నేతలు నువ్వానేనా అనే రీతిలో పోటీలో తలపడుతున్నారు. ఒకరు రెండుసార్లు, మరొకరు మూడు సార్లు ఎమ్మెల్యేగా పని చేసిన అనుభవం ఉంది. ఉమ్మడి రాష్ట్రంలో మలక్‌పేట స్థానం నుంచి టీడీపీ అభ్యర్థిగా మల్‌రెడ్డి రంగారెడ్డి మొదటిసారి ఎమ్మెల్యేగా 1994లో గెలుపొందారు. మారిన రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన మల్‌రెడ్డి రంగారెడ్డి అదే స్థానం నుంచి 2004 ఎన్నికల బరిలో నిలవగా.. ప్రత్యర్థిగా టీడీపీ నుంచి మంచిరెడ్డి కిషన్‌రెడ్డి మొదటిసారి అతనితో పోటీకి దిగారు. ఈ ఎన్నికల్లో మల్‌రెడ్డి రంగారెడ్డి చేతిలో మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ఓటమి చెందారు. నియోజకవర్గాల పునర్విభజన అనంతరం జరిగిన ఎన్నికల్లో మంచిరెడ్డికి అదృష్టం కలిసి వస్తుండటంతో ఇబ్రహీంపట్నం స్థానం నుంచి వరుసగా మూడు సార్లు నుంచి విజయం సాధిస్తూ వస్తున్నారు. మంచిరెడ్డి 2009లో జరిగిన ఎన్నికల్లో మల్‌రెడ్డి రంగారెడ్డిని, 2014 ఎన్నికల్లో మల్‌రెడ్డి సోదరుడు రాంరెడ్డిని ఓడించారు. అనంతరం టీఆర్‌ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. తర్వాత జరిగిన 2018 ఎన్నికల్లో టీఆర్‌ఎస్ నుంచి మంచిరెడ్డి బరిలోకి దిగగా కాంగ్రెస్ నుంచి టికెట్ దక్కకపోవడంతో బీఎస్పీ నుంచి మల్‌రెడ్డి రంగారెడ్డి మళ్లీ తలపడ్డారు. ఈ ఎన్నికల్లో మల్‌రెడ్డిని కేవలం 356 స్వల్ప ఓట్ల తేడాతో ఓడించి మంచిరెడ్డి హ్యాట్రిక్ సాధించారు. దశాబ్దాల కాలం నుంచి వీరిద్దరి మధ్య ఎత్తులు, జిత్తులతో రాజకీయ వైరం కొనసాగుతునే ఉంది. ఇప్పుడు మళ్లీ బీఆర్‌ఎస్ నుంచి మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, కాంగ్రెస్ నుంచి మల్‌రెడ్డి రంగారెడ్డిలు ప్రధాన పార్టీల అభ్యర్థులుగా రంగంలో ఉండటంతో వీరిద్దరి మధ్యనే రసవత్తరంగా పోటీ నడుస్తోంది. ఎవ్వరిని విజయం వరిస్తుందో రాజకీయ విశ్లేషకులు సైతం చెప్పలేని పరిస్థితులు నెలకొన్నాయి.

అభివృద్ధే కీలక ఆయుధంగా.. మంచిరెడ్డి

నియోజకవర్గం నుంచి కిషన్‌రెడ్డి మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. బీఆర్‌ఎస్‌లో చేరిన అనంతరం ఈ నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులే తన గెలుపునకు కీలక ఆయుధంగా మారుతుందని ఎన్నో ఆశలతో కిషన్‌రెడ్డి ఉన్నారు. సుమారు రూ.3 వేల కోట్లతో అభివృద్ధి పనులు నియోజకవర్గంలో చేశానని, ప్రజలకు సంక్షేమ పథకాలను అందించినందున ఆ పనులే శ్రీరామరక్షగా నిలుస్తాయని కిషన్‌రెడ్డి చెప్పకుంటున్నారు.

ఎమ్మెల్యేపై వ్యతిరేకత, కాంగ్రెస్ హవా: మల్‌రెడ్డి రంగారెడ్డి

మంచిరెడ్డి కిషన్‌రెడ్డిపై ప్రజల్లో ఉన్న వ్యతిరేకత, గత మూడుసార్లు ఈ నియోజకవర్గం నుంచి మల్‌రెడ్డి బ్రదర్స్ పోటీ చేసి ఓడిపోయిన సానుభూతి తన గెలుపు సునాయాసం అవుతుందని మల్‌రెడ్డి రంగారెడ్డి గట్టి విశ్వసంతో ఉన్నారు. ఈసారి కాంగ్రెస్ టికెట్ దక్కడం కూడా ఆయనకు ప్లెస్ పాయింట్‌గా చెప్పుకుంటున్నారు.

మోదీపైనే ఆధారం..

బీజేపీ అభ్యర్థి నోముల దయానంద్‌గౌడ్ తొలిసారి ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలో ఉన్నాడు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పరిపాలన దక్షత, చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు తన విజయానికి దోహదపడుతాయని భావిస్తున్నారు.

కార్మికులు, కర్షకులు, ప్రజా సంఘాలపైనే..

సీపీఎం అభ్యర్థిగా బరిలో ఉన్న పగడాల యాదయ్య ఈ నియోజకవర్గానికి పరిచయస్తుడే.. గతంలో 2014, 2018 ఎన్నికల్లో రెండుసార్లు సీపీఎం నుంచి బరిలో నిలిచి ఓటమి చెందారు. కార్మికుల, కర్షకుల, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, ప్రజా సంఘాల మద్దతు ఉందని ఆయన చెప్పుకొస్తున్నారు. నిరంతరం ప్రజా సమస్యలపై పోరాడే సీపీఎం పార్టీకి ప్రజలు విజయాన్ని కట్టబెట్టుతారనే నమ్మకంతో ఉన్నారు.

బీఎస్పీ, డీఎస్పీ అభ్యర్థులు వెనుకంజ..

బీఎస్పీ నుంచి గొరిగే మల్లేశ్, డీఎస్పీ నుంచి తులసిగారి రవీందర్‌లు బరిలో ఉన్నా ఆశించిన విధంగా ఫలితం ఉండదని విశ్లేషకులు చెప్పుకుంటున్నారు. ఏది ఏమైనా నియోజకవర్గంలో మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, మల్‌రెడ్డి రంగారెడ్డిల మధ్యపోరు నువ్వానేనా అన్నట్లుగా ఉంది. ఈ నెల 30న జరిగే పోలింగ్, డిసెంబర్ 3న ఓట్ల లెక్కింపుతో అభ్యర్థుల భవితవ్యం తేలిపోనుంది. అంతవరకు ప్రజాతీర్పుపై సస్పెన్స్ కొనసాగాల్సిందే.

బీఆర్‌ఎస్ ఇంటింటి ప్రచారం



ప్రచారంలో ఓటు వేయాలని విజ్ఞప్తి చేస్తున్న సీతల్‌రెడ్డి



గూలాబీమయంగా మారిన రోడ్‌షో

ఇబ్రహీంపట్నం: బీఆర్‌ఎస్ అభ్యర్థి మంచిరెడ్డి కిషన్ రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరుతూ పట్నంలో ఆదివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కౌన్సిలర్ జెర్కొని బాల్‌రాజ్ ఆధ్వర్యంలో వివిధ కాలనీల్లో పర్యటించి కారు గుర్తుకు వేయాలని అభ్యర్థించారు. కేసీఆర్ పాలనలో ఎమ్మెల్యే మంచిరెడ్డి అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేసినట్లు వివరించారు. ప్రతి కుటుంబానికి ఏదో ఒక పథకం ద్వారా లబ్ధి పొందన్నారని తెలిపారు.

బీఆర్‌ఎస్‌లో చేరిన యువత

ఇబ్రహీంపట్నం రూరల్: బీఆర్‌ఎస్ చేపడుతున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పోల్కంపల్లి అనుబంధ గ్రామం మన్యెగూడకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆదివారం బీఆర్‌ఎస్ చేరారు. యువనాయకులు మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో గునుకుల కృష్ణ, గుర్జని మహేష్, సురేష్, ప్రభులతో పాటు తదితరులు బీఆర్‌ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో పోల్కంపల్లి ఎంపీటీసీ చెరుకూరి మంగ రవీందర్, మాజీ ఎంపీటీసీ సావిత్రి నర్సింహ, మాజీ పీఏసీఎస్ డైరెక్టర్ రవీందర్‌రెడ్డి, వినోద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గూలాబీమయం

ఇబ్రహీంపట్నం రూరల్: ఆదిబట్ల మున్సిపాలిటీలోని కొంగరకలాన్‌లో శనివారం రాత్రి నిర్వహించిన బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి మంచిరెడ్డి కిషన్‌రెడ్డి రోడ్ షో గూలాబీమయంగా మారింది. పట్టణం మొత్తం గూలాబీ తోరణాలు కట్టారు. గూలాబీ షాట్స్ అందరిని ఆకట్టుకున్నాయి.

తండ్రి కోసం కూతురు ప్రచారం

యాచారం: కారు గుర్తుకు ఓటేసి తన తండ్రి మంచిరెడ్డి కిషన్‌రెడ్డిని నాలుగోసారి ఎమ్మెల్యేగా గెలిపించాలని ఆయన కుమార్తె సీతల్‌రెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఆదివారం ఆమె యాచారం, మొగుళ్లవంపు, గాండ్లగూడెం గ్రామాల్లో ఇంటింటికి తిరిగి కారు గుర్తుకు ఓటేసి తన తండ్రిని గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. మండలంలో చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని గుర్తించి ఓట్లేయాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు మారోజ్ శ్రీనువాస్, ఎండీ ఖాజ్ తదితరులు పాల్గొన్నారు.